PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
All Insurances Cashless Available | 24/7 Emergency Services | Ambulance Services
+91 85230 89599 +91 86889 09384
Web: www.jaitrahospitals.com Mail: info@jaitrahospitals.com
Address: Beside ITI, NH 44, Chandra Nagar, Medchal, Telangana 501401.

విజయవాడ, హైదరాబాద్ ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు సంపుటి : 01 సంచిక : 11 శుక్రవారం, జూలై 31, 2026, పేజీలు - 8 వెల : 3 /-

## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

**- లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు**



**న్యూఢిల్లీ, జూలై 30:** వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం మిగతా2లో...

## హిందుత్వ అంటే మన జీవనవిధానం

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య**



**విజయవాడ, జూలై 30:** హిందుత్వం అంటే మతం కాదని.. జీవన విధానమని భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దేశభక్తి సమాజ ఐక్యత లోపిస్తే దేశం వెనకపడుతుందని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'కర్మవీరులారా కదిలి రండి' గీతం ఆవిష్కరణ, విద్యార్థులతో మాటామంతిలో పాల్గొని మిగతా2లో...



## సిదిరితో జగన్ ములాఖత్ రద్దు

**సాయంత్రం 5 తరవాత జైలు వద్దకు జగన్**

**నిబంధనల మేరకు ములాఖత్ కుదరదని తేల్చిన సిబ్బంది**

**శ్రీకాకుళం, జూలై 30:** వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో వైఎస్ జగన్ ములాఖత్‌కు జైలు అధికారులు అనుమతి నిరాకరించారు. నిర్ణయించిన సమయం ముగిసిన తర్వాత జైలు వద్దకు చేరుకోవడంతో, జైలు నిబంధనల ప్రకారం అధికారులు అనుమతి ఇవ్వలేదు. సాయంత్రం 5 గంటల తర్వాత సీదిరి అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు అనుమతి మిగతా2లో...

## రాజధాని ఎక్కడో చెప్పకుండా పంపించేశారు

**● ఆ కసితోనే రాష్ట్ర అభివృద్ధికి పూనుకున్నాం ● ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్**

**● ఆదోనిలో చిన్నారుల కోర్కె నెరవేర్చిన మంత్రి**



**కర్నూలు, జూలై 30:** రాష్ట్ర విభజన సమయంలో రాజధాని ఎక్కడో చెప్పకుండా మనల్ని గెంటేశారని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ కసితోనే రాష్ట్రంలో అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. గురువారం కర్నూలులో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయని అంటే అందులో ఆ శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉందని తెలిపారు. ఓ పట్టుదలతో తామంతా పనిచేస్తున్నామని అన్నారు. రిలయన్స్, ఫార్మాతోపాటు ఇతర పరిశ్రమలు కర్నూలు జిల్లాకు వస్తున్నాయని ఆయన వివరించారు. పట్టుదలతోపాటు క్రమశిక్షణతో పనిచేయాలని ఈ సందర్భంగా యువతకు మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ మిగతా2లో...



## పవన్‌తో మంత్రి నిమ్మల భేటీ

**ఎల్‌నినోపై ఇరు నేతల చర్చ**

**ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలన్న పవన్**

**అమరావతి, జూలై 30:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం భేటీ అయ్యారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై చర్చించారు. సూపర్ ఎల్‌నినో, తద్వారా రాష్ట్రంలో నెలకొన్న సాగు నీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలని పవన్ సూచించారు. రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి పరిస్థితులను వివరించాలన్నారు. సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించాలని మిగతా2లో...

## మహిళా ఎస్సై పట్ల వైకాపా నేతల తీరు దారుణం

**జగన్ కాన్వాయ్ కోసం ఇంత హంగామా చేయడమా..?**

**మండిపడ్డ మంత్రి పార్థసారథి**



**అమరావతి, జూలై 30:** శ్రీకాకుళంలో మహిళా ఎస్సై పట్ల వైకాపా నేతల తీరును మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రంగా ఖండించారు. వైకాపా నేతలు పోలీసులపై దాడి చేసే స్థాయికి వచ్చారన్నారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి కుటుంబసభ్యులను జగన్ పరామర్శించాల్సింది పోయి.. ఎవరి కోసం వెళ్లారని ప్రశ్నించారు. జగన్ వెళ్లే మార్గంలోనే భోగాపురంలో ప్రధాని మోదీ పర్యటన ఉంది. ప్రధానికి భద్రత కల్పించే దారిలో ఆందోళనలు చేయకూడదు. భద్రతా కారణాల రీత్యా జగన్ పర్యటనలో ధర్నాలు, ర్యాలీలు, సభలకు అనుమతి లేదు. భయపెట్టి అధికారంలోకి వచ్చేందుకు జగన్ మిగతా2లో...

## పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డ్రామాలు


- బలప్రద్శన కోసమే జగన్ పర్యటన
- మహిళా ఎస్ఐపై అనుచిత ప్రవర్తన దారుణం
- జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత



2లో

## నిందితులను కాపాడేందుకే జగన్ పరామర్శ యాత్రలు

**- మంత్రి అచ్చెన్నాయుడు**



**అమరావతి, జూలై 30:** పరామర్శ పేరుతో రాజకీయ డ్రామాలు, బలప్రదర్శనలు చేయడం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ శైలిగా మారిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. నేరారోపణలు మిగతా2లో...

## పెనుకొండలో రూ.12 కోట్లతో ఐటీఐ కళాశాల

**- రూ.36 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి: మంత్రి సవిత**




**పెనుకొండ, జూలై 30:** పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి సాధ్యమవుతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో కియా సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య రూ.12 కోట్లతో ఐటీఐ కళాశాల నిర్మాణానికి ఎంవోయూ కుదిరిందని మంత్రి తెలిపారు. రెండు ఎకరాల్లో నిర్మించనున్న ఈ కళాశాల వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి వస్తుందని, త్వరలో భూమిపూజ నిర్వహిస్తామని చెప్పారు. మిగతా2లో...

## ఉత్తరాంధ్రకు మకుటాయమానం.. భోగాపురం విమానాశ్రయం

**ఆంధ్రుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రూపుదిద్దుకున్న టెర్మినల్**

**గ్లోబల్ ఇమేజ్‌కి చిరునామా భోగాపురం ఎయిర్‌పోర్ట్: మంత్రి కందుల దుర్గేష్**




**భోగాపురం, జూలై 30:** ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంత రాజకీయ, ఆర్థిక, పర్యాటక వృద్ధికి ప్రధాన చిరునామాగా మారనుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం" ప్రారంభోత్సవ ఏర్పాట్లను బుధవారం ఆయన సహచర మంత్రులతో, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్ లోపల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కట్టడాలు, కళాకృతులను మంత్రి దుర్గేష్ ఆసక్తిగా తిలకించగా సంబంధిత వివరాలను సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జున రావు వివరించారు. అనంతరం టెర్మినల్ భవనంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం ప్రస్ఫుటించేలా చేసిన ఏర్పాట్లను మంత్రి దుర్గేష్ కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..అభివృద్ధికి రెక్కలు వచ్చినట్లుగా, ఉత్తరాంధ్రకు గ్లోబల్ లుక్ వచ్చేలా దర్శనమిస్తున్న ఈ ఎయిర్‌పోర్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణలు, కూచిపూడి నృత్య భంగిమలు, ఏటికొప్పాక బొమ్మలు, మిగతా2లో...

# సిదిరితో జగన్ ములాఖత్ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. ఈ విషయంపై జైలర్.. ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపగా, జైలు నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అధికారులు స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటలలోపే ములాఖత్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. దీంతో జగన్ అప్పలరాజు ములాఖత్‌కు అనుమతి లభించలేదు. ఇకచేసేది లేక జైలు వద్ద అప్పలరాజు కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. అంతకుముందు విశ్శాఖ చేరుకున్న జగన్ అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీకాకుళం చేరుకున్నారు. ప్రస్తుతం అంపోలు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఆయన జైలులో ములాఖత్ ద్వారా పరామర్శించాలనుకున్నారు. ఎన్నికల అనంతరం జగన్ శ్రీకాకుళం జిల్లాకు రావడం ఇదే తొలిసారి కావడంతో వైసీపీ శ్రేణులు ఈ పర్యటనకు ప్రాధాన్యం ఇచ్చాయి. సీదిరి అప్పలరాజు కుమారుడు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనలో, కుమారుడిని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై పోలీసులు అప్పలరాజును అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జగన్ ఆయనను పరామర్శించడానికి ఇక్కడికి చేరుకున్నారు. భోగాపురం, పూసపాటిరేగ, పైడి భీమవరం, రణస్థలం, ఎచ్చెర్ల మీదుగా అంపోలు జిల్లా జైలుకు చేరుకుని మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు అప్పలరాజుతో ములాఖత్ నిర్వహించాలనుకున్నారు. అయితే, వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ఆంక్షలు విధించారు పోలీసులు.. జైలు వద్ద ములాఖత్‌కు మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. ర్యాలీలు, భారీ జనసమీకరణకు అనుమతి లేదని శ్రీకాకుళం పోలీసులు స్పష్టం చేశారు. గతంలో క్రౌడ్ గ్యాదరింగ్‌ల సమయంలో చోటుచేసుకున్న ఘటనలు, ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన, శాంతిభద్రతల అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు..అయినా జగన్ సమయానికి అక్కడికి చేరుకోలేక పోయారు.

# రాజధాని ఎక్కడో చెప్పకుండా పంపించేశారు

(మొదటి పేజీ తరువాయి)

మూడు నెలల్లో (90 రోజుల్లో) వస్తుందని ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గతంలో తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తనను పత్తికొండలో పోలీసుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేశారని.. కానీ ప్రజలు, కార్యకర్తలు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు.యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం.. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోలార్ ప్రాజెక్టులు వస్తుంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూనిట్‌పై రూ.13 పైసలు తగ్గించామన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఇదిలావుంటే ఇచ్చిన మాట ప్రకారం ఆదోని చిన్నారుల కోరికను మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. చిన్నారులు సహస్ర ఆద్య, జయ స్కందను కలిసిన మంత్రి వారితో ఫొటో దిగారు. దీంతో చిన్నారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. 'లోకేశ్ సర్ మిమ్మల్ని కలవాలి, మీతో ఫొటో దిగాలని ఉంది' అంటూ ఆదోని చిన్నారుల వీడియో సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేసింది. వెంటనే ఈ వీడియోపై స్పందించిన మంత్రి.. 'నేను కూడా మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను' అంటూ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అంతే కాకుండా చిన్నారుల వీడియోను రీ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆదోని పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్.. చెప్పిన మాట ప్రకారం చిన్నారులను కలిశారు. వారితో కలిసి ఫొటో దిగారు. దీంతో ఇద్దరు చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తమ అభిమాన నాయకుడితో ఫొటో దిగడం పట్ల చిన్నారులు హర్షం వ్యక్తం చేశారు.

# పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డ్రామాలు

**అమరావతి, జూలై 30:**మాజీ మంత్రి సిదిరి అప్పలరాజుకు పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఏపీ హోంమంత్రి అనిత మండిపడ్డారు. గురువారం రాజధాని అమరావతిలో ఆమె మాట్లాడుతూ.. పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. జైలు నిబంధనలు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌రెడ్డికి తెలుసునని పేర్కొన్నారు. కానీ కావాలనే ములాఖత్ సమయం పూర్తయ్యాక జైలు వద్దకు ఆయన వెళ్లారని ఆరోపించారు. శ్రీకాకుళంలో మహిళా ఎస్సైపై వైకాపా నేతల దాడిని మహిళా లోకం ఖండించాలని రాష్ట్ర హోంమంత్రి అనిత అన్నారు. విధుల్లో ఉన్న మహిళా ఎస్సైపై జుగుప్సాకరంగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల గొడ్డలి పార్టీ నేతల తీరు మారాలన్నారు. వైకాపా నేత సీదిరి అప్పలరాజుతో ములాఖత్‌కు సమయానికి వెళ్లకుండా జగన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సీదిరి అప్పలరాజును కలవాలనుకుంటే ములాఖత్ సమయానికే జగన్ వెళ్లాలి. సమయానికి వెళ్లకుండా రాజకీయాలు చేస్తున్నారు. నిజానికి అప్పలరాజును కలవాలన్న ఆలోచన జగన్‌కు లేదు. ములాఖత్‌కు మధ్యాహ్నం 2-3 గంటల మధ్య అధికారులు సమయం ఇచ్చారు. సాయంత్రం 5 తర్వాత జగన్ వెళ్తే అర్థమేంటి? కేవలం బలప్రదర్శన ఆలోచనే ఆయనకు ఉంది. మహిళా ఎస్సై పట్ల సొంత పార్టీ నేతలు ప్రవర్తించిన తీరుకు జగన్ క్షమాపణ చెప్పాలని అనిత డిమాండ్ చేశారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళానికి బల ప్రదర్శన చేసుకుంటూ వైసీపీ అధినేత వెళ్లారని వివరించారు. అయితే జగన్ పర్యటనలో పోలీసులు ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని గుర్తు చేశారు. మహిళా ఎస్ఐ పట్ల వైసీపీ నేతలు దురుసుగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అప్పలరాజు కుమారుడు తప్పు చేసినందుకే కేసు పెట్టారని హోం మంత్రి అనిత గుర్తు చేశారు. ఆసుపత్రిలో ఉన్న తన చెల్లిని పరామర్శించడానికి సమయం ఉండదు కానీ.. హిట్ అండ్ రన్ కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నించిన మాజీ మంత్రిని పరామర్శించడానికి మాత్రం సమయం ఉంటుందని ఎద్దేవా చేశారు. వక్ర బుద్ధి.. డైవర్షన్ పాలిటిక్స్ చేయడం కోసమే వైఎస్ జగన్ ఇదంతా చేశారని వ్యంగ్యంగా హోం మంత్రి అనిత అన్నారు

# ఉత్తరాంధ్రకు మకుటాయమానం.. భోగాపురం విమానాశ్రయం

(మొదటి పేజీ తరువాయి)

తోలుబొమ్మలాట చిత్రాలు, కలంకారీ పెయింటింగ్స్ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవానికి అద్దంపట్టేలా ఉంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రత్యేకించి శ్రీశైలం, తిరుమల, లేపాక్షి నంది వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, మన్యం అందాలను చాటిచెప్పే డిజిటల్ స్క్రీన్‌లు, వాల్ పెయింటింగ్స్‌తో ఆంధ్రా వైభవం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉందని అభినందించారు. 'ఫ్లైయింగ్ ఫిష్' ఆకారంలో రూపొందించిన టెర్మినల్ డిజైన్, విద్యుద్దీపాలంకరణతో అత్యంత సుందరంగా ఉందన్నారు. అంతేగాక ఎయిర్‌పోర్టులోని ఏరో బ్రిడ్జ్, ఏరో ట్రాఫిక్ కంట్రోల్ టవర్, రన్‌వే, టాక్సీవేలు, ఏప్రాన్ ప్రాంతాలు, అప్రోచ్ రోడ్లను మంత్రి దుర్గేష్ నిశితంగా పరిశీలించారు. హైస్పీడ్ సెక్యూరిటీ స్కానింగ్, ఫాస్ట్ డిజిటల్ చెక్-ఇన్, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్ ఇ-గేట్స్, విశాలమైన పార్కింగ్ స్థలాలు, ఎస్క లేటర్లు, ఎలివేటర్లు వంటి ఆధునిక వసతులు ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి అనుభూతిని అందిస్తాయని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ నమూనాను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విశాఖ రైల్వే జోన్‌తో పాటు భోగాపురం ఎయిర్‌పోర్టు ద్వారా కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధికి పెద్దపీట వేసిందని మంత్రి తెలిపారు. ఈ విమానాశ్రయం వల్ల ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు, పెట్టుబడులు తరలివస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటకం, విమానయాన, పారిశ్రామిక రంగాలలో విపరీతమైన అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర భవిష్యత్తును మార్చే గేమ్ చేంజర్ ఈ ఎయిర్ పోర్ట్ అని చెబుతూ.. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో ఇది కీలక భూమిక పోషిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు గ్లోబల్ ఇమేజ్ తీసుకొస్తుందని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని.. అందుకు అనుగుణం గానే ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాని పర్యటన సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న 'థింసా' నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని వెల్లడించారు. ఆగస్టు 1న జరగనున్న ఈ చారిత్రాత్మక ఘట్టంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

# గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం

### తయారీదారులను ఆదేశించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

**హైదరాబాద్, జూలై 30:**గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణెళిశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణెళిశ్ విగ్రహాలను ప్రతిష్టించినట్లు వివరించారు. విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్రహాల ప్రతిష్టాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. దూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను నివారించాలని ఆదేశించారు. రవాణాకు ముందు స్థానిక ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలని తయారీదారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లై ఓవర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని



ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు సర్టి÷డ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయకుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

# వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

# హిందుత్వ అంటే మన జీవనవిధానం

(మొదటి పేజీ తరువాయి)

వెంకయ్యనాయుడు ప్రసంగించారు. మంచి గీతాలు వినాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం మనందరికీ సమాధానమని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. శక్తివంతమైన భారత్ కావాలంటే యువతి, యువకుల పాత్రే కీలకమని ఉద్ఘాటించారు. మొబైల్ ఫోన్, యూట్యూబ్‌లపై యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పుకొచ్చారు. యువత మంచి గురువును ఎంచుకోవాలని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఎక్కువగా చదవాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# పవన్‌తో మంత్రి నిమ్మల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు నిమ్మలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.నీటి విడుదలతో పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట రైతులకు సాగునీటి సమస్యకు ఊరట లభించిందని పవన్ అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై గ్రామస్థాయిలో ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రతి రైతు పీఎం ఫసల్ బీమా యోజనలో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదే అని... నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. కాలువల్లో పూడిక తొలగింపు, నీటి గట్టుల లీకేజీల నివారణపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ జిల్లా, పిఠాపురంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా భుజం శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని నిమ్మల ఆకాంక్షించారు.

# మహిళా ఎస్సై పట్ల వైకాపా నేతల తీరు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

యత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు తావులేదు. రెండేళ్లుగా ఆయన పర్యటనలను చూస్తున్నాం. భయానక వాతావరణం కల్పించడమే జగన్ లక్ష్యం. ప్రధాని మోదీ పర్యటనను పక్కదారి పట్టించడమే ఆయన ఉద్దేశం. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం హైవేపై 120 కి.మీ. దూరం వెళ్లేందుకు 6 గంటలు అవసరమా అని పార్థసారథి ప్రశ్నించారు. మహిళలంటే వైకాపా నేతలకు ఎప్పుడూ గౌరవం లేదని మంత్రి సంధ్యారాణి అన్నారు. ఎవరైనా బాధితులను పరామర్శిస్తారని.. జగన్ మాత్రం నిందితుల వద్దకు వెళ్లారని విమర్శించారు. జగన్ ఎప్పుడూ నేరగాళ్లనే సమర్థిస్తారన్నారు.పోలీసులు, కోర్టులను వైకాపా నేతలు ఎప్పుడూ పట్టించుకోలేదని ఆమె విమర్శించారు.

# పెనుకొండలో రూ.12 కోట్లతో ఐటీఐ కళాశాల

(మొదటి పేజీ తరువాయి)

పెనుకొండ నియోజకవర్గంలో కియా, బెల్ సంస్థల సీఎస్ఆర్ నిధులతో రూ.36 కోట్ల విలువైన అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రి భవనాలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, రోడ్లు, సీసీ డ్రైనేజీల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, దీంతో ఉపాధి, పెట్టుబడులు, గ్రామీణ అభివృద్ధికి ఊతం లభిస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.

# నిందితులను కాపాడేందుకే జగన్ పరామర్శ యాత్రలు

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్న వారిని పరామర్శిస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీలు నిర్వహించడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య అని అన్నారు. శ్రీకాకుళంలో మహిళా పోలీసుల పట్ల వైసీపీ నాయకులు ప్రవర్తించిన తీరు ఖండనీయమని, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడులు చేయడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు.మాజీ మంత్రిని నిజంగా పరామర్శించాలనే ఉద్దేశం ఉంటే జైలు నిబంధనలకు అనుగుణంగా ములాఖత్ చేయాల్సిందని, కావాలనే ఆలస్యంగా వెళ్లి దానిని రాజకీయంగా మలచుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయంలో పరామర్శ యాత్ర పేరుతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారని విమర్శించారు.రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దానయ్య కుటుంబాన్ని పరామర్శించకుండా నిందితుల పక్షాన నిలవడం సరైందా అని ప్రశ్నించిన మంత్రి, బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచిందని తెలిపారు. బాధితుల కంటే నిందితులకే ప్రాధాన్యం ఇచ్చే రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

# శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం

**కర్నూలు, జూలై 30:** కృష్ణా నది ఎగువ పరివాహ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 79,403 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటలకు 824.80 అడుగులు.. నీటి నిల్వ 44.6090 టీఎంసీలుగా నమోదయింది. శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదు. వరద ఉధ్రుతితో జూరాల జలాశయం కళకళలాడుతోంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి మూడు రోజులుగా దిగువకు కృష్ణా జలాలు విడుదల చేస్తుండటంతో జూరాలలో క్రమేపీ మట్టం పెరుగుతోంది. జూరాల ఇన్‌ఎ÷-లో గురువారం ఉదయం 80వేల క్యూసెక్కులుగా నమోదైంది. జలవిద్యుత్ ఉత్పత్తితో 47వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా.. 10 గేట్లు ఎత్తి శ్రీశైలానికి నీరు విడుదల చేశారు.

# సంపాదకీయం

## ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్ !

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఏ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఏ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్తలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళు తుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామామూలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

## విధి నిర్వహణలో భయానికి తావు లేదు

- నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి
- సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర

**న్యూఢిల్లీ,జూలై30:** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. అది తమ నిబంధనల్లో భాగమేనని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

# ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

- ప్రజలు అనవసర అపోహలకు గురి కావద్దు
- ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ



**హైదరాబాద్,జూలై30:** రాష్ట్రంలో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో నాలుగు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ పక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76శాతం డిజిటలైజేషన్ పక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హుజూర్ నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోద్ నియోజకవర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సిఇఒ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం లిం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ పక్రియపై సంబంధిత డిఇఒలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ పక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్ లోడ్ చేసేలా బిఎల్ఒలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఒ, ఎఇఆర్ఒలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఒలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఇఒ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రాష్నాలైజేషన్ పక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లుమరిన వారి వివరాలు, అందుబాటులో లేని వారి జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్ఏల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇఆర్ఒ, ఎఇఆర్ఒ, బిఎల్ఒ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాఫ్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. దాంతోపాటు విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు.

# చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

- చైనా తీరుపై ట్రంప్ అసహనం



**వాషింగ్టన్,జూలై30:** అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్గ్÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

# ఇదేమి రాజ్యం?



నీట్ లీకేజీ ఉదంతం, కాక్రోచ్ ఉద్యమం, యువత ఆగ్రహం, విద్యామంత్రి రాజీనామా వెరసి కేంద్ర ప్రభుత్వానికి నిద్ర పడుతున్నట్టు లేదు. మొన్నటివరకు జంతర్‌మంతర్ కేంద్రంగా పోరాడిన విద్యార్థులపై లాఠీలు జులిపించి, టియర్‌గ్యాస్‌లతో బెదిరించి, పెల్లెట్ గన్స్ ప్రయోగించి పోరాటాన్ని అణచివేయాలనుకున్న మోడీ సర్కార్‌కు అది సాధ్యపడకపోగా అసమర్థ పాలనతో దేశమంతా అభాసుపాలైంది. అయితే, ఇప్పుడు ఆ యు వజన ఉద్యమంలో కీలకపాత్ర ఎవరిదన్న కోణంలో వేట మొదలు పెట్టింది. నీట్ కుంభకోణంపై దేశవ్యాప్తంగా చెలరేగిన ఆగ్రహాన్ని ఎదుర్కోలేక, ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు దిగడం కేంద్ర ప్రభుత్వ అసహనానికి నిదర్శనం. మొన్న ఢిల్లీలోని సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయంలోకి పోలీసు యంత్రాంగం అక్రమంగా చొరబడింది. యూనిఫాం లేదు, నేమ్‌బోర్డు లేదు, సివిల్ డ్రస్సుల్లో ప్రయివేటు వాహనాల్లో వచ్చి ఎస్ఎఫ్ఐ అఖిల భారత సంయుక్త కార్యదర్శి, జేఎన్‌యూ ఎస్‌యూ మాజీ అధ్యక్షురాలైన ఐషీ ఘోష్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించింది. అక్కడే ఉన్న సీపీఐ(ఎం) రాజ్యసభ నాయకుడు జాన్ బ్రిట్టాస్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు అడ్డుకోవడంతో వారు అక్కడినుంచి వెనుదిర గాల్సి వచ్చింది. అయితే ఢిల్లీ ఉద్యమానికి సంబంధించి విద్యార్థులు, యువతపై కేసులు పెట్టకూడదని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.ఇందులో ఏమీ చేయలేమనుకున్న ప్రభుత్వం ఐదేండ్ల నాటి కేసును తిరగదోడింది. కొన్ని నెలల క్రితం పాటియలా హౌస్‌కోర్టు జారీచేసిన నాన్ - బెయిలబుల్ వారెంట్‌ను చూపి ఐషీని అరెస్టు చేసి తీహార్ జైల్లో నిర్బంధించేందుకు కుట్ర పన్నినట్టు తెలుస్తోంది! ఆమె చేసిన తప్పేంటి? ప్రశ్నించడం నేరమా? విద్యా వ్యవస్థలో జరిగిన అక్రమాలను నిలదీయడం దేశద్రోహమా? పేపర్ లీక్ చేసిన వారిని వదిలేసి, లీకేజీని వ్యతిరేకించిన విద్యార్థులను నిర్బంధించాలను కోవడంలోనే , ఇక్కడే కేంద్రం కక్షపూరిత ధోరణి అర్థమవుతోంది. నీట్ పేపర్ లీకేజీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది. పరీక్షల విశ్వసనీయత దెబ్బతింది. నిరాశ నిస్పృ హలకు లోనై కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారితనం కొరవడింది. పరీక్షా నిర్వహణ సంస్థ తీరు అసంతృప్తిని రగిల్చింది. ప్రధాని మౌనవ్రతమే జవాబైంది. బాధ్యత వహించాల్సిన మంత్రి సీటు వదులుకోవడానికి ససేమిరా అన్నాడు. దీంతో దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు నిరసనబాట పట్టాయి. కాక్రోచ్ ఉద్యమం కూడా ఈ ఆవేదనకు ప్రతీకగా నిలిచింది. ఇదంతా నాణానికి ఒకవైపు అయితే, ఇప్పుడు విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలకులు, ఇప్పుడు వారినే నిందితులుగా చిత్రీకరించే పనిలో పడటం బాధాకరం.మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ప్రజాస్వామ్య దేశంలో ఒక చారిత్రక వారసత్వ గుర్తింపు పొంది, కొన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చిన ఒక జాతీయ పార్టీ కార్యాలయంలోకి తగిన చట్టపరమైన ప్రక్రియలను ఉల్లంఘిస్తే పోలీసులు ప్రవేశించడం అత్యంత ప్రమాదకర ధోరణి. ప్రభుత్వాలపై విమర్శలు చేయడం, నిరసనలు చేపట్టడం, ప్రజా సమస్యలపై ఉద్యమించడం రాజ్యాంగం కల్పించిన హక్కులు. విద్యార్థి ఉద్యమాలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో కీలక పాత్ర పోషించాయి. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి అత్యవసర పరిస్థితి వరకు, విద్య హక్కు నుంచి సామాజిక న్యాయం వరకు అనేక ప్రజా ఉద్యమాల్లో విద్యార్థులు ముందున్నారు. అలాంటి ఉద్యమాలను కేసులతో అణచివేయాలని చూడడం చరిత్రను తిరస్కరించడమే.కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా విమర్శించే ప్రతి వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటోందనే విమర్శలు పెరుగుతున్నాయి.రైతుల ఉద్యమం, కార్మిక సంఘాల నిరసనలు, విద్యార్థుల ఆందోళనలు, జర్నలిస్టులపై కేసులు, సామాజిక కార్యకర్తల అరెస్టులు-ఈ పరిణామాలన్నీ విభిన్న అభిప్రాయాలను అణచివేసే ధోరణిని ప్రతిబింబిస్తున్నాయి. ఇప్పుడు విద్యార్థి ఉద్యమాలపై కూడా అదే విధానాన్ని అమలు చేయడం ఆందోళన కలిగించే విషయం.ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, లోపాలపై చర్చ జరగకుండా, ప్రశ్నించిన వారిపైనే దృష్టిపెట్టడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ముందు నీట్ పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా విద్యార్థులు రోడ్డెక్కడానికి కారణమెవరు? పరీక్షల విశ్వస నీయత దెబ్బతినడం, వరుస లీకేజీలు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడడం-ఇవన్నీ ప్రభుత్వ వైఫల్యాలే. వీటికి బాధ్యత వహించాల్సిన కేంద్రం, వాటిపై ప్రశ్నించిన విద్యార్థులను నిందితులుగా నిలబెట్టడం ద్వారా తన బాధ్యత నుంచి తప్పించుకోలదు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు విమర్శలను భరించే సంస్కారం అవసరం. కేసులు, అరెస్టులు, పోలీసు వేధింపులు సమస్యలకు పరిష్కారం కావు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పడం, విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడం ప్రభుత్వ బాధ్యత. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి రాజకీయ కక్షతో వ్యవహరిస్తే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుంది.

# గొడ్డలి పార్టీ జగన్ రెడ్డికి ఆ ఇంగిత జ్ఞానం లేదు

- నేర ఆరోపణలు ఎదుర్కొంటోన్న వ్యక్తికి పరామర్శా
- దానయ్య కుటుంబాన్ని పరామర్శించాల్సిన బాధ్యత లేదా
- గొడ్డలి పార్టీ అంటేనే అసభ్య చేష్టల పార్టీ
- జైలులో ఉన్న జగన్ రెడ్డికి ములాఖత్ నిబంధనలు తెలియవా
- సొంత చెల్లిని పరామర్శించని వాడు సమాజం గురించి మాట్లాడడం విడ్డూరం
- మంత్రి కొండపల్లి



**విజయనగరం, జూలై 30 :** బాధితులకు అండగా నిలవాల్సింది పోయి, నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని పరామర్శించడం గొడ్డలి పార్టీ అధినేత వైఎస్. జగన్ రెడ్డికే చెల్లిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. గొడ్డలి పార్టీకి చెందిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు యాక్సిడెంట్‌లో ప్రాణం పోయిన దానయ్య కుటుంబాన్ని పరామర్శించాలన్న ఇంగిత జ్ఞానం జగన్ రెడ్డికి లేకపోవడం బాధాకరం అని మంత్రి వాపోయారు. జైలులో ఉండి వచ్చిన గొడ్డలి పార్టీ అధినేతకు ములాఖత్ నిబంధనలు తెలియవా... నిర్ణీత సమయంలో కలవకుండా.. శ్రీకాకుళం పర్యటనలో కేవలం బల ప్రదర్శన చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేశారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీ నాయకులు విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారులతో అసభ్య ప్రవర్తన, దాడులకు ప్రేరేపించడమేనా మీ గొడ్డలి పార్టీ కార్యకర్తలకు మీరు ఇచ్చే సందేశం అని మంత్రి ప్రశ్నించారు. మహిళా ఎస్సై ప్రవల్లికపై వైసీపీ నేతల దాడి హేయమైన చర్య అని.. గొడ్డలి పార్టీ అంటేనే అసభ్యపార్టీ.. అందుకే మహిళల విషయంలో దారుణంగా ప్రవర్తించారని మంత్రి పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ అధినేత తన పార్టీ పేరు సార్థకం చేసేలా ఎప్పుడూ నేరగాళ్లనే సమర్థిస్తారని... ఆస్పత్రిలో ఉన్న సొంత చెల్లెలిని పరామర్శించలేని వ్యక్తి నేర ఆరోపణలు ఎదుర్కొంటోన్న వారిని పరామర్శించడం రాజకీయ లబ్ధి కోసం ఆడుతోన్న నాటకం కాదా ? అని ప్రశ్నించారు. సొంత కుటుంబానికే విలువ ఇవ్వని వాడు.. సమాజం, ప్రజల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని నిబంధనలు విస్మరిస్తే ఊరుకునేది లేదని... చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి కొండపల్లి హెచ్చరించారు.

## సర్పంచ్ సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వడియారం గ్రామంలో వర్షాల ముందస్తు చర్యలు



**చేగుంట జూలై 30**
చేగుంట మండలం వడియారం గ్రామంలో భారీ వర్షాల నేపథ్యంలో పూరి గుడిసెలు కూలిపోయే స్థితిలో ఉన్న పెంకుటిళ్లలో నివసిస్తున్న ప్రజలను సర్పంచ్ అంకన్నగారి సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేశారు.ప్రజల భద్రత దృష్ట్యా ఎమర్జెన్సీ నివాసం కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాల లో గదులను ఏర్పాటు చేశారు.ఎవరికైనా ఎమర్జెన్సీ ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని కోరారు.

# సభా స్థలాన్ని పరిశీలించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రోగ్రాం ఇన్చార్జి మంతెన సత్యనారాయణ రాజు







**విజయనగరం, జులై 30**
ఆగస్టు ఒకటో తేదీన భోగాపురం శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ గారు ప్రారంభించిన అనంతరం నిర్వహించే సభా స్థలాన్ని గురువారం రాత్రి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రోగ్రాం ఇన్చార్జి మంతెన సత్యనారాయణ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలోని వివిఐపి, విఐపి, భూములు ఇచ్చిన రైతులు, జిఎంఆర్ సంస్థ కుటుంబ సభ్యులు, ఛాంపియన్స్, మీడియా సభ్యులు గ్యాలరీ లను పరిశీలించారు. సభా స్థలంలో వేసిన వేదికలు మధ్యన వర్షం పడినట్లయితే నీరు ఇంకెలా చర్యలు తీసుకోవాలని సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో 88 మంది అనాధలకు అన్న ప్రసాదన్న వితరణ



**చేగుంట జూలై 30**
లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో ఈరోజు ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శివంపేట మండలం మగ్ధంపూర్ గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.బేతాని సంరక్షణ అనాధ ఆశ్రమంలోని 88 మంది అనాధలకు అన్న ప్రసాద వితరణ పండ్లుఅందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ సభ్యులు మాట్లాడుతూ "సేవే పరమ ధర్మం. మనిషి జీవితానికి





నిజమైన అర్థం అతను సంపాదించిన సంపదలో కాదు, సమాజానికి అందించిన సేవల్లో ఉంది. పదవులు, బాధ్యతలు గౌరవాలు పొందడమే కాకుండా వాటిని ప్రజాసేవకు ఉపయోగించిన వారే సమాజంలో స్థిరంగా నిలిచిపోతారు" అని అన్నారు. లయన్ ఘట్టమనేని బాబురావు అలాంటి సేవా తపన కలిగిన వ్యక్తిత్వం కలిగిన వారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాజనకు రామచంద్రం, సెక్రెటరీ బుర్కా నాగరాజు, డి.సి స్వర్గం సిద్దాములు, సభ్యులు ఆకుల సంజీవ్, గుండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పీఎంఏజీవై కింద మంజూరైన నిధులను సత్వరమే వినియోగించి పనులు పూర్తి చేయాలి
- ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ఆదేశాలు









**విజయవాడ: జూలై 30,2026.**
ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (గ్రాహీూళ) పథకం కింద ఎంపికైన ఆదర్శ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు.విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన పీఎంఏజీవై పథకం సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధే ఈ పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న కేంద్ర ప్రాయోజిత పథకమైన ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా షెడ్యూల్డ్ కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 100 శాతం గ్రాంట్‌ను అందజేస్తుందని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు, సామాజిక-ఆర్థిక అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, డిజిటలైజేషన్, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి పది కీలక రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేపట్టడమే పథకం ఉద్దేశ్యమని వివరించారు. జిల్లాలోని





16 మండలాల్లో 2018-19 నుండి 2025-26 మధ్య (2021-22 మినహా) ఐదు దఫాలుగా మొత్తం 84 గ్రామాలను ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 2018-19 నుండి 2020-21 వరకు ఫేజ్-1లో ఎంపికైన 33 గ్రామాల అభివృద్ధి కోసం రూ.6,05,63,908 మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.1,43,62,549 వ్యయం చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.4,62,01,359 నిధులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే 2022 నుండి 2025-26 వరకు ఎంపికైన 51 గ్రామాలకు సంబంధించి మొత్తం 359 అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రతి ఆదర్శ గ్రామానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.1,020 లక్షల నిధులు అవసరమవుతాయని తెలిపారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖకు రూ.1,340.45 లక్షలు, గ్రామీణ నీటి సరఫరా శాఖకు రూ.270.05 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. నిధులను సకాలంలో వినియోగించి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదర్శ గ్రామాల్లో సోలార్ లైట్ల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఎస్సీ వర్గాల నివాస ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి నిజమైన ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, సాంఘిక సంక్షేమం తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రాధాన్యత క్రమంలో నిధులను వినియోగించి అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక ప్రకారం పనుల అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్.సి. ఆనంద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.శ్రావణ బాబు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమం





**చేగుంట జూలై 30**
లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో ఈరోజు శివంపేట మండలం మగ్ధంపూర్ ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు.బేతాని సంరక్షణ అనాధ ఆశ్రమం, మగ్ధంపూర్ లో పర్యావరణ పరిరక్షణకొరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం చేస్తామని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాజనకు రామచంద్రం, సెక్రెటరీ బుర్కా నాగరాజు, డి.సి స్వర్గం సిద్దాములు, సభ్యులు ఆకుల సంజీవ్, గుండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల సంచారం -- భయంలో గ్రామీణులు

**ప్రతిరోజూ వీధిలో కుక్కల కాపలా... చిన్న పిల్లలు, మహిళలకు తప్పని తిప్పలు**



**చేగుంట జులై 30**
చేగుంట మండల కేంద్రంలోని సన్నటి గల్లీల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఆ దారి పొడవునా గుంపులుగా చేరి తీక్షణంగా చూస్తున్న కుక్కలను దాటుకొని వెళ్లాలంటే బాటసారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రతిరోజూ ఈ ఇరుకు మార్గం నుంచే పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు, ఒంటరిగా నడిచే మహిళలు మరియు వృద్ధులు ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వణికిపోతున్నారు. వేరే ప్రాంతాల్లో వీధి కుక్కల దాడిలో చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలను గుర్తుచేసుకుంటూ తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు దారిలోనే కోతులు కూడా కాపు కాచి కూర్చుంటుండటంతో రాకపోకలు సాగించడం నరకప్రాయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కలు, కోతుల ముప్పు నుండి ఊరట కలిగించాలని, ఏదైనా జరగరాని ప్రమాదం జరగకముందే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పరిస్థితి తీవ్రంగా ఉన్నందున చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి



**పత్తికొండ జూలై 30:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పత్తికొండ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ అన్నారు. గురువారం హోసూర్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకుసుమారు రూ. 1,600 కోట్లతో డ్రిప్ ఇరిగేషన్, సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం అన్నారు. అయితే 2019లో ప్రభుత్వం మారడంతో అప్పటివరకు ప్రారంభించిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. మరల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పరిశ్రమలు వస్తున్నాయి, పెట్టుబడులు పెరుగుతున్నాయి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయన్నారు. ఇటీవలే స్వర్ణగిరిలో గోల్డ్ ప్లాంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా దాదాపు 800 మందికి ఉపాధి లభించిందన్నారు. అదే విధంగా హోసూరు ప్రాంతంలో 2,000 ఎకరాల్లో 400 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కలుగనున్నాయన్నారు. అదే విధంగా టమాటా ప్రాసెసింగ్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. దీని ద్వారా యువతకు ఉపాధి కల్పించడంతో పాటు టమాటా రైతులకు గిట్టుబాటు ధరలు, మెరుగైన మార్కెట్ అవకాశాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విడుదల చేసిన తొలి శ్వేతపత్రం గంజాయి నిర్మూలనపైనే ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా గంజాయి సాగు జరగకుండా, మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టి యువత భవిష్యత్తును కాపాడాలనే సంకల్పంతో ఆ నిర్ణయం తీసుకున్నాం అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడం, కొత్త పరిశ్రమలను తీసుకురావడం మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ప్రతి ఇంట్లో పేదరికం లేకుండా ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నాం అన్నారు.

# మహిళల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు




**ఎమ్మిగనూరు జూలై 30:** అమాయకులైన మహిళలకు మాయమాటలు చెప్పి, వారిని అక్రమ మార్గాల్లో తరలించి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మిగనూరు జెసి జె కోర్టు జడ్జి పి. హేమ అన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం నందవరం గ్రామంలో జాతీయ మహిళల అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళలను మాయమాటలు చెప్పి వారిని అక్రమంగా ఇతర దేశాలకు తీసుకెళ్లి విక్రయించడం, వారితో తప్పుడు పనులు చేయించడం లాంటి పనులు చేస్తే అలాంటి వారికి కఠిన శిక్షలు ఉంటాయన్నారు. అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో మహిళలు అన్ని విషయాలపై అవగాహనలు కలిగి ఉండాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు ప్రజల దృష్టికి వేస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించి వారిని కాపాడాలని కోరారు. అలాగే ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు ఎక్కువ ఉన్నాయని వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హోసూరులో సోలార్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

**- కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకి/బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాల్ల బొజ్జమ్మ**



**దేవనకొండ జూలై 30:** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని హోసూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాత్మక సోలార్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టును రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి/బోయ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాల్ల బొజ్జమ్మ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది గుడిసె కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కప్పట్రాల్ల బొజ్జమ్మ మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్ కృషితో ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. హోసూరులో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా పరిశుభ్రమైన విద్యుత్ ఉత్పత్తి పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతికి దోహదపడుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సోలార్ సంస్థ ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన చక్రాల మాజీ సర్పంచ్ పూరి శ్రీరాములు

**- పత్తికొండ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చ**



**పత్తికొండ జూలై 30 :**-పత్తికొండ నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చక్రాల గ్రామ మాజీ సర్పంచ్ పూరి శ్రీరాములు చర్చించారు. తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కార్యాలయంలో మంగళవారం (జూలై 28) వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పూరి శ్రీరాములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పత్తికొండ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, గ్రామస్థాయిలో ప్రజా సమస్యలపై వివరించినట్లు తెలిపారు. అలాగే చక్రాల గ్రామంలో అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని ముందుకు సాగుతున్న తీరును, ప్రజలతో తనకున్న అనుబంధాన్ని జగన్‌మోహన్‌రెడ్డికి వివరించినట్లు పేర్కొన్నారు. ఈ భేటీ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతంపై పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం.

# మాదాసి, మాదారి కురవలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**● విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం ● మంత్రివర్గంతో చర్చించి న్యాయం చేస్తామని మంత్రి హామీ**





**పత్తికొండ జూలై 30:** రాష్ట్రంలో మాదాసి, మాదారి కురవలు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నందున వారిని ఎస్సీ జాబితాలో చేర్చి తగిన న్యాయం చేయాలని మాదాసి, మాదారి కురవ ఎస్సీ సంక్షేమ సంఘం పత్తికొండ నియోజకవర్గ అధ్యక్షుడు కె.పీ. బ్రహ్మయ్య కోరారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో సోలార్ కంపెనీ భూమిపూజ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను గురువారం మాదాసి, మాదారి కురవ నాయకులు కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కురవల ఆచార సంప్రదాయాలకు సంబంధించిన గొర్రెపిల్ల, కమ్మడి, కర తదితర వస్తువులను మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా కె.పీ. బ్రహ్మయ్య మాట్లాడుతూ మాదాసి, మాదారి కురవలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ముఖ్యంగా విద్యార్థులు తగిన విద్యా, సంక్షేమ ప్రయోజనాలు పొందలేకపోతున్నారని తెలిపారు. తమ సామాజిక వర్గాన్ని ఎస్సీ జాబితాలో చేర్చి ప్రభుత్వ పరంగా అవసరమైన రాయితీలు, అవకాశాలు కల్పించాలని కోరారు. వినతిపై మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ ఈ అంశాన్ని రాష్ట్ర మంత్రివర్గంతో చర్చించి, మాదాసి, మాదారి కురవలకు న్యాయం జరిగేలా తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. మంత్రిని కలిసేందుకు అవకాశం కల్పించిన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ. శ్యామ్‌కుమార్‌కు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మైలార్, రాఘవేంద్రరావు, తుగ్గలి మండల అధ్యక్షుడు ధనుంజయ, కృష్ణగిరి మండల అధ్యక్షుడు లచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ, స్కూల్ ఆయాలు, పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి:ఏఐటీయూసీ

**పత్తికొండలో లేబర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్**

**కార్మికులకు వేతనాల పెంపుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి**





**పత్తికొండ, జూలై 30:** అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు, స్కూల్ ఆయాలు, గ్రామపం చాయతీ పారిశుధ్య కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ పత్తికొండ తాలూకా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు కార్మికుల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు జి. నెట్టికంటయ్య, కార్యదర్శి హెచ్. రంగన్న మాట్లాడుతూ పత్తికొండ రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్నప్పటికీ లేబర్ కార్యాలయం లేకపోవడం కార్మికులకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. పత్తికొండలోనే లేబర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పనిభారానికి అనుగుణంగా నెల వేతనాన్ని రూ. 36 వేలకు పెంచడంతో పాటు గ్రాట్యుటీ వర్తింపజేసి సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ ఆయాలకు అధికారిక గుర్తింపు కార్డులు అందజేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తూ వారి జీతాలను రూ. 18 వేలకు పెంచాలని కోరారు. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల వేతనాలను రూ. 36 వేలకు పెంచి, హెల్త్ అలవెన్సులు పునరుద్ధరించాలని, గ్లౌజులు, మాస్కులు, బూట్లు వంటి రక్షణ పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలోని ఆటో, హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. పత్తికొండ పడమటి ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఐటీ సైడ్ సెంటర్లు ఏర్పాటు చేసి స్థానిక కార్మికులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు మంత్రి నారా లోకేష్‌ను కోరారు.

# స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మించండి సారూ..

**మంత్రి లోకేష్‌కు జైభీమ్ యువసేన సభ్యులు చిన్నారి విద్యార్థులతో కలిసి వినతి**

**హోసూరులో పాఠశాల విద్యార్థుల భద్రతపై ఆందోళన**

**అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి**



**పత్తికొండ జూలై 30:** పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో సోలార్ ప్రాజెక్ట్ భూమిపూజ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు జైభీమ్ యువసేన సభ్యులు, ఎస్‌డబ్ల్యూఎంపీపీ పాఠశాల విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలోని ఎస్‌డబ్ల్యూఎంపీపీ పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని వారు కోరారు. ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల భద్రతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పాఠశాల సమీపంలోనే ప్రధాన రహదారి ఉండటంతో నిత్యం రద్దీగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే హోసూరు గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి నివసిస్తున్నారని, జనాభా పదివేలకు పైగా ఉండగా ఓటర్ల సంఖ్య సుమారు ఎనిమిది వేల వరకు ఉందని తెలిపారు. గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మంత్రి లోకేష్‌ను కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని, అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని జై భీమ్ యువసేన సభ్యులు విజ్ఞప్తి

# వినూత్న ఆవిష్కరణలకు వేదికగా.. "స్టార్ట్ అప్ కడప": జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప,జూలై 30:** సరికొత్త ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలకు వేదికగా జిల్లా యువతను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూపుదిద్దుకుంటున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్ త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనతో కలిసి నిర్మాణ పనులను పూర్తి చ్చేసుకుని చకచకా జరుగుతున్న ఫినిషింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భవనం బాహ్య నిర్మాణ పనులను వారంలోపు పూర్తి చేసి, వెంటనే అంతర్గత సదుపాయాల ఏర్పాటును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్ట్‌అప్ ఆవిర్భవించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా "స్టార్ట్ అప్ కడప" రూపుదిద్దుకుంటోందన్నారు. ఇది కేవలం ఒక భవనం కాదని.. యువత ఆలోచనలకు, ఆవిష్కరణలకు, కొత్త వ్యాపారాల ఆరంభానికి బలమైన వేదికగా నిలవనుందన్నారు. ఈ కేంద్రం ద్వారా స్టార్ట్‌అప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలకు అవసరమైన మార్గదర్శకత్వం, ఆధునిక సదుపాయాలు, ప్రోత్సాహం లభిస్తాయని తెలిపారు. కడపను పారిశ్రామిక అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నిర్మాణ పనుల పరిశీలనలో కేఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్, హౌసింగ్ ఇంజనీర్లు, ఏడీపీ యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

# సున్నిపెంటలో ఈనెల 31న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**● "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో**

**భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ**



**నంద్యాల, జూలై 30:** జిల్లా పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావడం, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడం లక్ష్యంగా చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31వ తేదీన శ్రీశైలం నియోజకవర్గంలోని సున్నిపెంటలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణవేణి (రెడ్డివారి) కల్యాణ మండపంలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, సంబంధిత శాఖల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను నేరుగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని శ్రీశైల మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

# విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు: జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్



**నంద్యాల, జూలై 30 :** నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గురువారం ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించారు. కార్యాలయ ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, పరిశుభ్రమైన వాతావరణంతో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ పరిపాలన, రీ-సర్వే పెండింగ్ అంశాలు, ప్రజలకు అందిస్తున్న సేవల పురోగతిపై ఆత్మకూరు ఆర్డీవో, ఆత్మకూరు తహసీల్దార్, కొత్తపల్లి తహసీల్దార్, డీఐఓఎస్ ఆత్మకూరు తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన ప్రతి దరఖాస్తును ప్రభుత్వం నిర్దేశించిన సేవా ప్రమాణాల గడువులోనే పరిష్కరించాలని సూచించారు. బియాండ్ ఎస్ఎల్ఏ కేసులు ఏవీ ఉండకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రీ-సర్వే పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.. ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్డీవో వెంకటశివ, సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానం సేవ సమితి పాంప్లెట్‌ను ఆవిష్కరించిన ఎన్.ఎండి. ఫిరోజ్




**నంద్యాల, జూలై 30:**
నంద్యాల పట్టణ శివారులో కుందూనది ఒడ్డున వెలసిన శ్రీ శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానం ఆవరణంలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించిన పాంప్లెట్ గురువారం తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం ఆవరణంలో జరిగే పనులకు సంబంధించి బ్రోచర్ను విడుదల చేయడం సంతోషంగా ఉందని పనులు పూర్తయిన వెంటనే తాను కూడా దేవస్థానానికి వచ్చి పరిశీలిస్తానని అలాగే తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. అలాగే శ్రీ శ్రీ గంగమ్మ తల్లి దేవస్థాన సేవా సమితి నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన గౌరవాధ్యక్షులు సీనియర్ జర్నలిస్టు బొల్లవరం శివకుమార్, అధ్యక్షులు ఎర్రగుంట్ల నాగభూషణం, ఉపాధ్యక్షులు లింగందిన్నె లింగమూర్తి, కోశాధికారి తూర్పునాటి శీను, కమిటీ సభ్యులు దేవరగట్టు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు 4వ రోజు డోర్ టు డోర్ కార్యక్రమం

**కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తున్న వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు**





**నంద్యాల, జూలై 30:** నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు 4వ రోజు డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు పర్యటించారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ 2ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం గురించి ప్రజలకు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు మరియు అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించడం జరిగింది అదేవిధంగా నంద్యాల పట్టణం నందు మరి ముఖ్యంగా మన వార్డు నందు మంత్రి ఎన్ఎండిఫరూక్ పూర్తి చేసిన అభివృద్ధి పనులు గురించి ప్రజలకు తెలుయజేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, స్థానిక ఎమ్మెల్యే, న్యాయ మరియు మైనార్టీ శాఖ మంత్రి చీ.వీ.ఎ.ఫరూక్ వారి కుమారులు ఎన్ఎండి ఫిరోజ్, ఎన్ఎండి ఫయాజ్ పర్యవేక్షణలో నిర్వహిం చడం జరిగింది అని ఆయన అన్నారు. స్థానిక టీడీపీ నాయకులు మహేష్ బాబు, రమణ మరియు బూత్ కన్వీనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మిట్నాల గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**పైప్‌లైన్ పనులను ప్రారంభించిన టీడీపీ నాయకులు శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి**



**నంద్యాల, జూలై 30:** ఎల్‌నినో ప్రభావంతో నంద్యాల నియోజకవర్గ పరిధిలోని మిట్నాల గ్రామంలో ఏర్పడిన తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం లభించనుంది. న్యాయశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు, యువ నాయకులు ఫిరోజ్ , ఫయాజ్ ల ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో నూతన తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజల సహకారం, గ్రామీణ నీటి సరఫరా (ఆర్డబ్ల్యూఎస్) శాఖ అధికారుల సూచనలతో శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఈ పైప్‌లైన్ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయడం కోసం ఈ పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే పనులను పూర్తి చేసి, ఓవర్‌హెడ్ ట్యాంకుల (రక్షిత మంచినీటి ట్యాంకులు) ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని అన్నారు . మన గ్రామం మన బాధ్యత అనే లక్ష్యంతో గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని వారు తెలిపారు . తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి ఫరూక్ గారికి, పనుల ప్రారంభానికి సహకరించిన గ్రామ పెద్దలు, యువత, మరియు గ్రామ ప్రజలకు శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు శీలం రాజేశ్వర్ రెడ్డి , శీలం మహేశ్వర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలిసిన ప్రభుత్వ న్యాయవాదులు.. గౌరవ వేతనం పెంచాలని వినతి




**నంద్యాల, జూలై 30:** రాష్ట్ర న్యాయశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని ప్రభుత్వ న్యాయవాదులు నంద్యాలలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాదుల (గవర్నమెంట్ ప్లీడర్స్) గౌరవ వేతనాన్ని పెంచవలసిందిగా కోరుతూ మంత్రి ఫరూక్ కి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు గవర్నమెంట్ ప్లీడర్ (జి.పి) కృష్ణమూర్తి, నంద్యాల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏ.జి.పి) వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లామని, మారుతున్న కాలానికి అనుగుణంగా గౌరవ వేతనాన్ని పెంచాలని కోరినట్లు తెలిపారు. వినతి పత్రంపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ , ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో పులివెందుల విద్యార్థిని దివ్యశ్రీకి స్వర్ణ పతకం

**- విద్యతో పాటు క్రీడలు ముఖ్యం : ముఖ్య అతిథి భూమిరెడ్డి ఉమాదేవి**

**పులివెందుల జూలై 30:** జమ్మూ అండ్ కాశ్మీర్‌లోని జమ్మూ తావిలో 'నేషనల్ కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్' ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పులివెందులకు చెందిన విద్యార్థిని వై.దివ్యశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచింది. అండర్-14 బాలికల బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో దివ్యశ్రీ అత్యుత్తమ ప్రదర్శనతో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం (గోల్డ్ మెడల్) సాధించింది. జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన ఈ విద్యార్థినిని ఆమె చదువుతున్న ఎక్సలెంట్ నాగార్జున స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పాఠశాల యాజమాన్యం ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన భూమిరెడ్డి ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించి పట్టణానికి, పాఠశాలకు మంచి పేరు తెచ్చిన వై.దివ్యశ్రీని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొని దివ్యశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు.



# 9 ఏళ్ల తర్వాత లంక గడ్డపై టెస్ట్ సిరీస్.?



ఆగస్టు నెలలో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం భారత క్రికెట్ అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఏకంగా 9 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత శ్రీలంక గడ్డపై భారత జట్టు రెడ్ బాల్ మ్యాచ్ ఆడనుండటమే ఈ ఆసక్తికి ప్రధాన కారణం. ఈ సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ ఇప్పటికే ప్రకటించింది. ఇక అందరి దృష్టి ఆగస్టు 15న గాలేలో జరిగే తొలి టెస్ట్ మ్యాచ్ తుది జట్టు కూర్పుపైనే నెలకొంది.శ్రీలంక టూర్ కోసం బీసీసీఐ ప్రకటించిన 15 మంది సభ్యుల స్క్వాడ్‌లో ఎక్కువగా పాత ఆటగాళ్లకే ప్రాధాన్యం ఇచ్చినా, 33 ఏళ్ల మధ్యప్రదేశ్ ఆఫ్ స్పిన్ ఆల్ రౌండర్ సారాంశ్ జైన్ ఎంపిక మాత్రం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ సమయంలో స్టార్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయపడటంతో అతడు ఈ తొలి టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో లైక్-టు-లైక్ రిప్లేస్‌మెంట్‌గా సారాంశ్ జైన్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. దేశవాళీ క్రికెట్‌లో సుదీర్ఘకాలంగా రాణిస్తున్న సారాంశ్‌కు భారత జట్టులో చోటు దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇటీవలే ఇండియా-ఏ తరపున శ్రీలంక పర్యటనలో అద్భుత ప్రదర్శన కనబరిచిన అతడు, ఏకంగా ఆరు వికెట్లు పడగొట్టడమే కాకుండా బ్యాట్‌తో కూడా 70 పరుగులు చేసి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.ఈ జట్టులో గత అఫ్ఘానిస్థాన్ టెస్టుకు ఎంపికైన ముగ్గురు ఆటగాళ్లు స్థానం కోల్పోయారు. గాయాల కారణంగా వాషింగ్టన్ సుందర్‌తో పాటు, నితీశ్ కుమార్ రెడ్డిలు జట్టుకు దూరం కాగా, స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి రావడం వల్ల యువ ఆటగాడు హర్ష్ దుబే స్థానాన్ని కోల్పోయాడు. నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో ఎవరినీ తీసుకోకుండా, పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను తిరిగి జట్టులోకి తీసుకున్నారు. అయితే బుమ్రా, సాయి సుదర్శన్ ఇద్దరూ తుది జట్టులో ఆడాలంటే ముందుగా వారు ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ అవ్వాల్సి ఉంటుంది. తుది జట్టు అంచనా.. ఆ ముగ్గురు స్పిన్నర్లకు ఛాన్స్..!తొలి టెస్ట్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తున్న గాలే ఇంటర్నేషనల్ స్టేడియం స్పిన్నర్లకు స్వర్గధామం లాంటిది. దీంతో తుది జట్టులో ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ ఎంపిక పక్కా అయినట్లే. ఇక మూడో స్పిన్నర్ కోసం పోటీ తీవ్రంగా ఉంది. ప్రత్యర్థి శ్రీలంక జట్టులో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు ఎక్కువగా ఉన్నందున, వారిని కట్టడి చేయడానికి ఆఫ్ స్పిన్నర్ అయిన సారాంశ్ జైన్‌కే తుది జట్టులో ఆడే అవకాశం దక్కవచ్చు. అదే జరిగితే గాలే వేదికగా అతడు తన అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేయనున్నాడు.ద్వయ.బ్యాటింగ్ విభాగంలో ఎప్పటిలాగే ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లతో పాటు, వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక ఫాస్ట్ బౌలింగ్ బాధ్యతలను జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ తమ భుజాలపై వేసుకునే అవకాశం ఉంది. ఒకవేళ బుమ్రా ఫిట్‌గా ఉంటే అతడే ప్రధాన పేసర్‌గా బరిలోకి దిగుతాడు. దీంతో శుభ్‌మన్ గిల్ కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న మరో ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్‌కు ఈసారి కూడా నిరాశే మిగిలే అవకాశం ఉంది. అఫ్ఘానిస్థాన్ సిరీస్ లోనూ అతనికి తుది జట్టులో చోటు దక్కని విషయం తెలిసిందే.శ్రీలంకతో తొలి టెస్టుకు భారత సంభావ్య తుది జట్టు (అంచనా): యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, సారాంశ్ జైన్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

# టీ20 ర్యాంకింగ్స్‌లో చరిత్ర సృష్టించిన ఛోటా ప్యాకెట్



ఐసీసీ ఈరోజు విడుదల చేసిన టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమ్ ఇండియా వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ తన నంబర్ 1 స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 916 రేటింగ్ పాయింట్లతో కిషన్ మరో ముఖ్యమైన మైలురాయిని సాధించాడు. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ తర్వాత అత్యధిక రేటింగ్ ఉన్న మూడో బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ప్రస్తుత టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ 3వ స్థానానికి పడిపోయాడు. అయితే, టీ20 ర్యాంకింగ్స్‌లో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన రికార్డు అతని పేరిట ఉంది. ఈ జాబితాలో ఇంగ్లండ్‌కు చెందిన డేవిడ్ మలన్ 2వ స్థానంలో ఉండగా, ఇషాన్ కిషన్ 3వ స్థానంలో ఉన్నాడు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, టాప్ ఐదు స్థానాల్లో నలుగురు భారత ఆటగాళ్లు ఉండగా, ఈ జాబితాలో డేవిడ్ మలన్ ఒక్కడే భారతీయుడు కాని ఆటగాడు.అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత ఆటగాళ్ల జాబితాలో ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీలను అధిగమించాడు. విరాట్ అత్యుత్తమ టీ20 రేటింగ్ పాయింట్ల మొత్తం 909 కాగా, సూర్య 912 రేటింగ్ పాయింట్లు సాధించాడు. ఇప్పుడు ఇషాన్ వారిద్దరినీ అధిగమించాడు.

హిట్‌మ్యాన్‌కు జోడీగా బుడ్డోడు.. సరికొత్త ఓపెనర్స్‌తో బరిలోకి..అయితే, అభిషేక్ శర్మ 931 రేటింగ్ పాయింట్లతో టీ20 ర్యాంకింగ్స్‌లో అత్యధిక రేటింగ్ పొందిన ఆటగాడిగా ఉన్నాడు. అభిషేక్ శర్మ సుమారు 11 నెలల పాటు అంతర్జాతీయ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానంలో నిలిచాడు. గత ఏడాది

# వైస్ కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ..




భారత దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నీ దులీప్ ట్రోఫీ 2026 సీజన్ కోసం ఈస్ట్ జోన్ (తూర్పు మండలం) బలమైన జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు డాషింగ్ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ నాయకత్వం వహించనుండగా.. ఇటీవల జింబాబ్వే టూర్‌లో అద్భుతంగా రాణించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అనూహ్యంగా వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించి అందరినీ ఆశ్చర్య పరిచారు.దులీప్ ట్రోఫీ కోసం ఈస్ట్ జోన్ ప్రకటించిన జట్టులో అందరి దృష్టి బీహార్ యువ కెరటం వైభవ్ సూర్యవంశీ వైపే నిలిచింది. కేవలం 15 ఏళ్లకే దేశవాళీలో వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఒక అరుదైన మైలురాయి. ఈ డాషింగ్ లెఫ్ట్ హ్యాండర్ ఇటీవల తన అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో ఆశించిన మేర రాణించకపోయినా, జింబాబ్వేపై తన విశ్వరూపం చూపించాడు. హరారే వేదికగా జరిగిన మూడో టీ20లో కేవలం 49 బంతుల్లోనే 81 పరుగులు బాది, తన కెరీర్‌లోనే బెస్ట్ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సిరీ ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో ఆశించిన మేర రాణించకపోయినా, జింబాబ్వేపై తన విశ్వరూపం చూపించాడు. హరారే వేదికగా జరిగిన మూడోస్‌లో మొత్తం 151 పరుగులు రాబట్టి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును కూడా సొంతం చేసుకున్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇప్పటివరకు కేవలం 8 మ్యాచ్‌లు మాత్రమే ఆడినా, అతని అటాకింగ్ స్టైల్ చూసి సెలెక్టర్లు అతనిపై ఎంతో నమ్మకం ఉంచారు.

# మొదటిసారి హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారా?
## ఈ తప్పులు చేస్తే నష్టపోతారు




ప్రస్తుతం వైద్య ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా మారింది. అయితే చాలామంది ప్రీమియం తక్కువగా ఉందనే కారణంతో లేదా పూర్తి వివరాలు తెలుసుకోకుండా పాలసీ తీసుకుంటారు. దీంతో క్లెయిమ్ చేసే సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేసే ముందు ఈ ముఖ్యమైన విషయాలను తప్పనిసరిగా పరిశీలించాలని బీమా రంగ నిపుణులు సూచిస్తున్నారు. 1. తక్కువ ప్రీమియం చూసి పాలసీ ఎంచుకోవద్దుచాలా మంది తక్కువ ప్రీమియం ఉన్న పాలసీలనే ఎంచుకుంటారు. కానీ అలాంటి ప్లాన్లలో కవరేజ్ పరిమితంగా ఉండే అవకాశం ఉంది. పెద్ద చికిత్సలు అవసరమైనప్పుడు ఆస్పత్రి ఖర్చుల్లో గణనీయమైన భాగాన్ని మీరే భరించాల్సి రావచ్చు. కాబట్టి ప్రీమియంతో పాటు బీమా మొత్తం (ాబఎ ×అంబతీవన), ఇతర ప్రయోజనాల గురించి కూడా పరిశీలించాలి.

2. వెయిటింగ్ పీరియడ్, మినహాయింపులు తెలుసుకోండిప్రతి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలో కొన్ని వ్యాధులకు వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. అలాగే కొన్ని చికిత్సలు లేదా వ్యాధులు పాలసీ పరిధిలో ఉండకపోవచ్చు. అందువల్ల పాలసీ డాక్యుమెంట్‌లోని నిబంధనలు, మినహాయింపులు పూర్తిగా చదివి అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

3. నెట్‌వర్క్ ఆస్పత్రులను తప్పనిసరిగా చెక్ చేయండిమీ నగరంలో లేదా మీకు సమీపంలోని ప్రముఖ ఆస్పత్రులు ఆ ఇన్సూరెన్స్ కంపెనీ నెట్‌వర్క్‌లో ఉన్నాయా లేదా అనేది ముందుగానే తెలుసుకోండి. నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉంటే క్యాష్‌లెస్ చికిత్స పొందడం సులభమవుతుంది.

4. క్లెయిమ్ సెటిల్‌వెంట్, ఇతర ప్రయోజనాలు పరిశీలించండికేవలం పాలసీ అమౌంట్ మాత్రమే కాదు, క్లెయిమ్ సెటిల్‌మెంట్ తీరు, ప్రీ-హాస్పిటలైజేషన్, పోస్ట్-హాస్పిటలైజేషన్ కవరేజ్, రూమ్ రెంట్ పరిమితులు, కో-పే నిబంధనలు, రిస్టోరేషన్ బెనిఫిట్ వంటి అంశాలను కూడా పరిశీలించాలి. ఇవి అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక భారం తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

హెల్త్ ఇన్సూరెన్స్‌ను కేవలం పన్ను ఆదా కోసం లేదా తక్కువ ప్రీమియం కోసం కాకుండా, కుటుంబ ఆరోగ్య భద్రత కోసం దీర్ఘకాలిక పెట్టుబడిగా చూడాలి. పాలసీ నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకుని, మీ అవసరాలకు సరిపోయే కవరేజ్‌ను ఎంచుకుంటే భవిష్యత్తులో వైద్య అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా మరింత భద్రత కలుగుతుంది.

# క్రెడిట్ కార్డు క్యాష్‌బ్యాక్, రివార్డులపై ట్యాక్స్ ఉంటుందా..?




ఈ రోజుల్లో క్రెడిట్ కార్డులు దాదాపు ప్రతి ఒక్కరు వాడుతున్నారు. కానీ నెలవారీ బిల్లు జనరేట్ అయిన వెంటనే, ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతుంది. స్టేట్‌మెంట్ అందిన వెంటనే బిల్లు చెల్లించాలా, లేదా గడువు తేదీ వరకు వేచి ఉండటం మంచిదా? బిల్లు చెల్లింపు సమయం మీ క్రెడిట్ స్కోర్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది కాబట్టి ఈ గందరగోళం తరచుగా వినియోగదారులలో కొనసాగుతుంది. ఈ విషయంలో సరైన దశలను, అది మీ ఆర్థిక జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చూద్దాం..మీ ఇమెయిల్ లేదా ఫోన్‌లో క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ సందేశం వచ్చినప్పుడు, చాలా మంది గడువు తేదీ వరకు వేచి ఉంటే వారి జ×దీ×ూ స్కోరు పడిపోతుందేమో అని ఆందోళన చెందుతారు. వాస్తవం ఏమిటంటే మీరు స్టేట్‌మెంట్ వచ్చిన వెంటనే చెల్లించాలా లేదా గడువు తేదీలోపు మీ బిల్లును చెల్లించడానికి గ్రేస్ పీరియడ్‌ని ఉపయోగించాలా అనేది మీ క్రెడిట్ స్కోరుకు పట్టింపు లేదు. మీ చెల్లింపు బ్యాంకు నిర్దేశించిన గడువులోపు జరిగితే, మీ ఆర్థిక రికార్డు పూర్తిగా సురక్షితంగా ఉంటుంది. మీ ఆర్థిక సౌలభ్యం, నగదు లభ్యతను బట్టి మీరు ఏదైనా ఎంపికను ఎంచుకోవచ్చుగడువు తేదీ వరకు వేచి ఉండటంలో తప్పు లేదు, కానీ నిర్లక్ష్యం కారణంగా ఈ గడువు దాటితే, మీకు నిజమైన ఇబ్బంది మొదలవుతుంది. బ్యాంకు గడువు తర్వాత చెల్లింపు చేయడం ఆలస్య చెల్లింపుగా పరిగణించబడుతుంది. ఇది మీ మొత్తం క్రెడిట్ చరిత్రను తీవ్రంగా దెబ్బతీసే తీవ్రమైన తప్పు. మీ జ×దీ×ూ స్కోరు దెబ్బతిన్న తర్వాత, భవిష్యత్తులో గృహ రుణం, కారు రుణం లేదా కొత్త కార్డు పొందడం చాలా కష్టం అవుతుంది. అందువల్ల, బిల్లులను సకాలంలో చెల్లించడం ఆర్థిక ప్రాధాన్యతగా చేసుకోవడం చాలా ముఖ్యం.క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లలో ఎల్లప్పుడూ రెండు రకాల మొత్తాలు కనిపిస్తాయి. మొత్తం బకాయి, కనీస బకాయి. కనీస మొత్తాన్ని లేదా కనీస బకాయిని చెల్లించడం వల్ల బ్యాంకు జరిమానాలను నివారించవచ్చని, వారి శ్రేయస్సును నిర్ధారిస్తుందని ప్రజలు తరచుగా అనుకుంటారు. అయితే ఆర్థిక దృక్కోణం నుండి, ఇది ఒక పెద్ద ఉచ్చు అని నిరూపించబడింది. మిగిలిన మొత్తం అంటే కనీస మొత్తం, వచ్చే నెలకు ముందుకు తీసుకెళ్లబడుతుంది. బ్యాంకులు దానిపై గణనీయమైన వడ్డీని వసూలు చేస్తాయి. ఈ అలవాటు క్రమంగా గణనీయమైన అప్పుకు దారితీస్తుంది. మీ క్రెడిట్ స్కోర్‌పై దాని ప్రతికూల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఎల్లప్పుడూ పూర్తి బిల్లును చెల్లించండి.

# రైల్వే ప్రయాణికులకు అదిరిపోయే ఆఫర్.




భారత్‌లో రైళ్లల్లో తరచుగా లక్షలాది మంది ప్రయాణిస్తూ ఉంటారు. ఆన్‌లైన్‌లో ముందుగానే టికెట్ బుక్ చేసుకుని సౌకర్యవంతమైన ప్రయాణం చేస్తూ ఉంటారు. ఇక పలు ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫామ్స్ రైల్వే టికెట్ల బుకింగ్‌పై ఆఫర్లను ప్రకటిస్తూ ఉంటాయి. అలాగే క్రెడిట్ కార్డుల ద్వారా చేసే బుకింగ్స్‌పై కూడా డిస్కౌంట్లు పొందే అవకాశముంది. ఐఆర్‌సిటిసి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులను ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి) పలు ప్రముఖ బ్యాంకుల సహకారంతో తీసుకొచ్చింది. ఈ కార్డుల ద్వారా రైలు టిక్కెట్లను బుక్ చేసుకోవడం ద్వారా మీరు రివార్డ్ పాయింట్లను సంపాదించవచ్చు. ఆ పాయింట్లను తర్వాత రైలు టిక్కెట్లు లేదా ఇతర ప్రయాణ సంబంధిత సేవలను కొనుగోలు చేయడానికి ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా,భాగస్వామ్యంతో ఈ కార్డులను అందిస్తున్నాయి.బ్యాంక్ క్రెడిట్ కార్డ్ ద్వారా ఆన్‌లైన్ టికెట్ల బుకింగ్ సమయంలో మంచి డిస్కౌంట్స్ పొందవచ్చు. ×=జుజ వెబ్‌సైట్ లేదా రైల్ కనెక్ట్ యాప్ ద్వారా తరచుగా టిక్కెట్లు బుక్ చేసుకునే వారికి ఈ కార్డ్ అనుకూలమైనదిగా చెప్పవచ్చు. ఈ కార్డుకు రూ. 500 అదనపు రుసుము, రూ. 500 వార్షిక రుసుము ఉంటుంది. మొదటిసారి కార్డ్ తీసుకునే వారికి 500 రివార్డ్ పాయింట్లు అందిస్తారు. ×=జుజ వెబ్‌సైట్ లేదా రైల్ కనెక్ట్ యాప్‌లో ఖర్చు చేసే ప్రతి రూ. 200కి 5 రివార్డ్ పాయింట్లు అందుతాయి. ఖూ యాప్ చెల్లింపులు, ×=జుజ ఫ్లైట్, హోటల్, క్రూయిజ్ బుకింగ్‌లపై కూడా రివార్డులు పొందవచ్చు. ఈ కార్డ్ రైలు టిక్కెట్ల బుకింగ్‌లపై 1 శాతం లావాదేవీ రుసుము మినహాయింపును కూడా అందిస్తుంది. సంవత్సరంలో 8 సార్లు ×=జుజ ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లను ఉచితంగా ఉపయోగించుకునే సౌకర్యం ఉంది.-ఐఆర్‌సీటీసీ ఎస్‌బీఐ కార్డ్ కూడా అనేక ప్రయోజనాలను అందిస్తోంది. ఈ కార్డు పొందేందుకు రూ. 500 తొలుత చెల్లించాలి. అలాగే రెన్యూవల్ ఫీజు రూ. 300 ఉంటుంది. కార్డు పొందిన తర్వాత 350 బోనస్ రివార్డ్ పాయింట్లు వస్తాయి. ఐఆర్‌సిటిసి టిక్కెట్ బుకింగ్‌లపై ఖర్చు చేసే ప్రతి రూ. 100కి 10 రివార్డ్ పాయింట్లను పొందవచ్చు. ఈ కార్డు ద్వారా ప్రతి సంవత్సరం 4 ఉచిత రైల్వే లాంజ్ సౌకర్యం పొందవచ్చు.-ఇక ఐఆర్‌సిటిసి బ్యాంక్ ఆఫ్ బరోడా క్రెడిట్ కార్డ్ కూడా అనేక బెనిఫిట్స్ అందిస్తోంది. ఈ కార్డుకు రూ.500 నమోదు ఫీజుతో పాటు రెన్యూవల్ ఫీజు రూ. 350 ఉంటుంది. కొత్త వినియోగదారులకు 500 బోనస్ రివార్డ్ పాయింట్లు అందుతాయి. ఐఆర్‌సీటీసీ టిక్కెట్ బుకింగ్‌లపై ఖర్చు చేసే ప్రతి రూ. 100కి గరిష్టంగా 40 బాబ్‌కార్డ్ రివార్డ్ పాయింట్లు లభిస్తాయి. సంవత్సరానికి 4 సార్లు ఉచిత రైల్వే లాంజ్ సదుపాయం పొందవచ్చు.బ్యాంక్ క్రెడిట్ కార్డ్ ట్రైన్లలో ఎక్కువగా ప్రయాణించేవారికి బాగా ఉపయోగపడుతుంది. ఈ కార్డ్ కోసం రూ. 500 ఆన్‌బోర్డింగ్ ఫీజు ఉంటుంది. కొత్త కార్డ్ హోల్డర్లకు రూ. 500 విలువైన వెల్‌కమ్ గిఫ్ట్ వోచర్ అందిస్తారు. ×=జుజ టిక్కెట్ బుకింగ్‌లపై చేసే ప్రతి రూ. 100 ఖర్చుకు 5 రివార్డ్ పాయింట్లు లభిస్తాయతి. సంవత్సరానికి 8 ×=జుజ ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు ఉచితంగా పొందవచ్చు.

# స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే మూవీ రివ్యూ

సానుభూతి కోసం వాడకుండా, కథలో చాలా సహజంగా కలిపేశాడు. దీనివల్ల అతనికి ఎదురయ్యే చిన్న కష్టం కూడా మనకు బాధను కలిగిస్తుంది, అతను సాధించే విజయం మనకు ఆనందాన్ని ఇస్తుంది. ఎక్కడా హడావుడి పడకుండా, వరుస పెట్టి పేలుళ్లు, ఫైట్లు




కథ:పీటర్ పార్కర్ అనే వ్యక్తి ఉన్నాడనే విషయాన్ని ప్రపంచం మొత్తం మర్చిపోయాక.. స్పైడర్ మ్యాన్ పూర్తిగా ఒంటరివాడైపోతాడు. ప్రజల ప్రాణాలు కాపాడే బాధ్యతలో పడి, తనకంటూ ఓ సొంత జీవితం, సంతోషం లేకుండా చేసుకుంటాడు. తన గర్ల్ ఫ్రెండ్ కూడా తన వల్ల ప్రమాదంలో పడుతుందని తెలిసి దూరంగా ఉంటాడు. మరోవైపు పీటర్ లవర్ వీజీ తన గతం పూర్తిగా మర్చిపోతుంది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ఒక భయంకరమైన కొత్త శత్రువు నగరంలోకి అడుగుపెడతాడు. దానివల్ల పాత గాయాలు మళ్లీ రేగుతాయి. తన శక్తులతో పాటు మానసిక ధృడత్వాన్ని కూడా పరీక్షించే ఈ కొత్త సవాళ్ల మధ్య పీటర్ ఎలా నెగ్గుకొచ్చాడు..? న్యూయార్క్ నగరాన్ని కాపాడుకునే ఈ పోరాటంలో అతను ఏం చేశాడు..? అనేది మిగతా కథ.కథనం:స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే సినిమా చేసిన మంచి పని ఏంటంటే.. గత చిత్రం 'నో వే హోమ్' సాధించిన భారీ విజయాన్ని మళ్లీ రిపీట్ చేయాలని చూడకపోవడం. పాత పాత్రలను తీసుకొచ్చి మ్యాజిక్ చేద్దామనే ఆలోచన పక్కనపెట్టి.. పీటర్ తన జీవితాన్ని సున్నా నుంచి ఎలా మొదలుపెట్టాడనే దానిపైనే దర్శకుడు పూర్తిగా దృష్టి పెట్టాడు. హీరో ఒంటరితనాన్ని కావాలని పెట్టకుండా, ఎమోషన్ పండాల్సిన చోట కథను నెమ్మదిగా నడిపించిన విధానం చాలా ఆకట్టుకుంటుంది. సినిమా బాగా మొదలవుతుంది. పెద్దగా గూస్‌బంప్స్ తెప్పించే సీన్స్ లేకపోయినా, పాత్రలను పరిచయం చేసిన విధానం, నెమ్మదిగా కథను నడిపించిన తీరు కట్టిపడేస్తుంది. ఈ సినిమాకి ఉన్న అతిపెద్ద ప్లస్ పాయింట్... రియలిస్టిక్ గా ఉండటం. మరో భారీ సూపర్ హీరో సినిమా లాగా కాకుండా, పీటర్ పడే కష్టాల మీద ఇది ఎక్కువ ఫోకస్ చేస్తుంది.యాక్షన్ సీన్స్ చాలా బాగున్నాయి. ప్రతి ముఖ్యమైన సీన్‌ను ఎలీశ, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఇంకో రేంజ్‌కు



# జీ5 ఓటీటీలో సినిమా పండగ..

అన్నీ వర్గాల ప్రేక్షకులకు డిఫరెంట్ కంటెంట్‌ను ప్రేక్షకులకు అందిస్తోన్న స్వదేశీ వీడియో స్ట్రీమింగ్ ఫ్లాట్‌ఫామ్ జీ5 ..ట్రెండ్‌ను ఫాలో కావటం కాదు..ట్రెండ్ క్రియేట్ చేయటంలో మాకు మేమే సాటి దూసుకెళ్తోంది. తాజాగా జీ5 మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. అత్యంత ప్రతిష్టాత్మక మల్టీలాంగ్వేజ్ కంటెంట్ లైనప్‌ను అనౌన్స్ చేసి అందరిలో తెలియని ఓ సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. కొత్త తరం ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ లైనప్‌లో కొత్త కథలు, క్రియేటర్స్, డిఫరెంట్ ఫార్మేట్స్ ఉండటం విశేషం. ఇంట్రెస్టింగ్ విషయమేమంటే.. తెలుగు, హిందీ, తమిళం, మరాఠీ, మలయాళం, కన్నడ, బెంగాలీ భాషలను కవర్ చేస్తూ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, లైవ్ స్పోర్ట్స్, ూ× ఆధారిత కథనాలు, యానిమేషన్, పిల్లల వినోదం వంటి విభిన్న కంటెంట్ ఈలైనప్‌లో ఉండటం విశేషం. ఈ విషయాన్ని నిర్భయంగా తెలియజేస్తూ..సంస్కృతికి దగ్గరగా ఉండేలా, చూసిన వెంటనే ఆకట్టుకునే వినోదాన్ని అందించాలనే నమ్మకంతో ఈ కొత్త లైనప్‌ను జీ5 రూపొందించింది. కేవలం వినోదమే కాకుండా సంస్కృతిని ప్రభావితం చేయడం, భాషలతో పాటు సరిహద్దులను దాటి ప్రయాణించే కథలను సృష్టించడమ్మే జుజు5 ఆలోచన. ప్రముఖ ఫ్రాంచైజీలు, ప్రీమియం ఒరిజినల్స్ నుంచి కొత్త తరహా ఫార్మాట్స్ వరకు, కథ చెప్పే విధానంలో కొత్త ప్రమాణాలు సెట్ చేస్తూ భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులతో తన అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది జీ5.ఈ కంటెంట్ లైనప్‌కు టాప్ క్రియేటివ్ పార్ట్‌నర్స్ బలం కూడా తోడయ్యింది. భారతదేశంలోని ప్రముఖ స్టూడియోలు, దర్శకులు, కంటెంట్ క్రియేటర్స్‌తో కలిస్గి జుజు5 ఈ భారీ ప్రాజెక్స్‌కు రూపకల్పన చేస్తోంది. ప్రాంతీయంగా చూస్తే మన కథ, అందులోని విషయ పరిజ్ఞానాన్ని మరింతగా బలోపేతం చేస్తూ తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్, శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర, వృద్ధి సినిమాస్, తమిళంలో ఫ్యాషన్ స్టూడియోస్, కన్నడలో కెవిఎన్ ప్రొడక్షన్స్, మలయాళంలో తెస్పియాన్ ఫిల్మ్స్, మరాఠీలో బహవా ఎంటర్‌టైన్‌మెంట్, ప్రతిసాడ్ ప్రొడక్షన్స్, కైరా కుమార్ క్రియేషన్స్, బెంగాలీలో అక్రోపోలిస్ ఎంటర్‌టైన్మెంట్, అంజన్‌దత్ ప్రొడక్షన్స్, వై సో సీరియస్ ఫిల్మ్స్, సురేందర్ ఫిల్మ్స్, జీ స్టూడియోస్ వంటి ప్రముఖ సంస్థలతో జీ5 చేతులు కలిపింది.

# ఆహా.. ఇది కదా కావాల్సింది..!?



బాలీవుడ్ ఇండస్ట్రీలో ఉన్న ప్రముఖ దర్శకులలో నితేష్ తివారీ ఒకరు. ఆయన దర్శకత్వంలో పాన్-ఇండియన్ పౌరాణిక కథా చిత్రంగా రామాయణంరామాయణం రూపొందుతోంది. ఈ చిత్రంలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ యశ్ రావణుడిగా కనిపించనున్నాడు. అలాగే పంచదరా బొమ్మ కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రను పోషిస్తుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ఈ ట్రైలర్ అద్భుతంగా అనిపిస్తుంది. రామాయణాన్ని విజివాల్ వండర్ గా కళ్లకు కట్టినట్టు చూపించే ప్రయత్నం చేశారు మేకర్స్.ఇక రాముడిగా రణబీర్ కపూర్ అద్భుతంగా నటించారు. అలాగే సీతగా సాయి పల్లవి ఆకట్టుకుంది. అదేవిధంగా రావణాసురిడిగా యష్ అదరగొట్టాడు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు కనీ వినీ ఎరుగని రీతిలో దాదాపు రూ.4,000 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో 'రామాయణ' రూపొందుతోంది. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదు, గ్లోబల్ మార్కెట్‌లో భారతీయ సినిమా సత్తాను చూపించే ప్రయత్నం. ఆస్కార్ విజేత హ్యాన్స్ జిమ్మర్ సంగీతం, హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్ వంటి అంశాలు ఈ చిత్రాన్ని అంతర్జాతీయ ఆడియన్స్‌కు కూడా చేరువ చేస్తున్నాయి.

# అజిత్, సూర్యల సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్

టాలీవుడ్ లో విక్టరీ- వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ లది సూపర్ హిట్ కాంబినేషన్. గతంలో వీరిద్దరి కాంబోలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీ శ్వరి వంటి మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ వచ్చాయి. ఇప్పుడిదే కాంబినేషన్ లో రాబోతోన్న మరో సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' (ఏకే 47). హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తోన్న ఈ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ లో విక్టరీ వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే యువినా పార్ధవి, నివేదా పేతురాజ్, రాజ్ ప్రజ్వల్, రావు రమేశ్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ తదితరులు వివిధ పాత్రల్లో నటిస్తున్నారు.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తోన్న ఈ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ లో విక్టరీ వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే యువినా పార్ధవి, నివేదా పేతురాజ్, రాజ్ ప్రజ్వల్, రావు రమేశ్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ తదితరులు వివిధ పాత్రల్లో నటిస్తున్నారు.ఇప్పటికే దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న ఆదర్శ కుటుంబం సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్లలో భాగంగా ఈ సినిమాలోని పాత్రలను పరిచయం చేస్తూ వరుసగా గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నారు. తాజాగా వెంకటేష్ కూతురు సంపూర్ణ పాత్రను ఇంట్రడ్యూస్ చేస్తూ బుధవారం ఓ వీడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఇందులో తన క్యూట్ యాక్టింగ్, డైలాగ్స్ తో అందరిని ఆకట్టుకుంది యువీనా పార్ధవిఇప్పటికే దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న ఆదర్శ కుటుంబం సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్లలో భాగంగా ఈ సినిమాలోని పాత్రలను పరిచయం చేస్తూ వరుసగా గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నారు. తాజాగా వెంకటేష్ కూతురు సంపూర్ణ పాత్రను ఇంట్రడ్యూస్ చేస్తూ బుధవారం ఓ వీడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఇందులో తన క్యూట్ యాక్టింగ్, డైలాగ్స్ తో అందరిని ఆకట్టుకుంది యువీనా పార్ధవి ఈ నేపథ్యంలో ఆదర్శకుటుంబం సినిమాలో వెంకటేష్ కి కూతురుగా నటిస్తున్న ఈ యువీనా పార్ధవి ఎవరా? అని నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గురించి పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి. ఈ యువీనా పార్ధవి చెన్నైలో సెటిలైన తెలుగు కుటుంబానికి చెందిన అమ్మాయి. చైల్డ్ ఆర్టిస్ట్ గా అనేక తమిళ్ సినిమల్లో నటించింది.ఈ నేపథ్యంలో ఆదర్శకుటుంబం సినిమాలో వెంకటేష్ కి కూతురుగా నటిస్తున్న ఈ యువీనా పార్ధవి ఎవరా? అని నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గురించి పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి.



# అప్పుడు టీవీ ఛానెల్ యాంకర్.. ఇప్పుడు కోట్ల ఆస్తులకు యువరాణి,

సినిమా గ్లామర్ ప్రపంచంలో ఆమె టాప్ హీరోయిన్లలో ఒకరు. నటనపై ఆసక్తితో ముందుగా మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు.. ఇప్పుడు బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలలో దూసుకుపోతుంది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన ఆమె.. జర్నలిజం చదువు పూర్తి చేసింది. ఆ తర్వాత కొన్నాళ్లపాటు ఓ ఛానల్లో రిపోర్టర్ గా జాబ్ చేసింది. కానీ నటనపై ఆసక్తి ఉన్న ఆమె.. న్యూస్ రూమ్ నుంచి చలనచిత్ర పరిశ్రమ వైపు అడుగులు వేసేలా చేసింది.ఇప్పుడు సొంతంగా ఐల్యాండ్ , కోట్ల ఆస్తి ఉన్న హీరోయిన్ ఆమె. ఆ హీరోయిన్ మరెవరో కాదండి. జాక్వెలిన్ ఫెర్నాండెజ్. జాక్వెలిన్ తండ్రి శ్రీలంకకు చెందినవారు. తల్లి మలేషియా. ఆమె బహ్రెయిన్‌లోని మనామాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే విభిన్న సంస్కృతి, సంప్రదాయల మధ్య పెరిగింది. సిడ్నీ విశ్వవిద్యాలయం నుండి మాస్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి శ్రీలంకకు తిరిగి వచ్చింది.ఇప్పుడు సొంతంగా ఐల్యాండ్ , కోట్ల ఆస్తి ఉన్న హీరోయిన్ ఆమె. ఆ హీరోయిన్ మరెవరో కాదండి. జాక్వెలిన్ ఫెర్నాండెజ్. జాక్వెలిన్ తండ్రి శ్రీలంకకు చెందినవారు. తల్లి మలేషియా. ఆమె బహ్రెయిన్‌లోని మనామాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే విభిన్న సంస్కృతి, సంప్రదాయల మధ్య పెరిగింది. సిడ్నీ విశ్వవిద్యాలయం నుండి మాస్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి శ్రీలంకకు తిరిగి వచ్చింది.అక్కడ ఆమె టెలివిజన్ రిపోర్టర్‌గా, లంక బిజినెస్ రిపోర్ట్ షోకు యాంకర్‌గా పనిచేసింది. 2006లో లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలో తన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మిస్ యూనివర్స్ శ్రీలంక కిరీటాన్ని గెలుచుకుంది. ఆ తర్వాత 2009లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో వచ్చిన అలాడిన్ అనే ఫాంటసీ డ్రామాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఫస్ట్ మూవీతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమె ఐఫా స్టార్ డెబ్యూ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంది.అక్కడ ఆమె టెలివిజన్ రిపోర్టర్‌గా, లంక బిజినెస్ రిపోర్ట్ షోకు యాంకర్‌గా పనిచేసింది. 2006లో లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలో తన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మిస్ యూనివర్స్ శ్రీలంక కిరీటాన్ని గెలుచుకుంది. ఆ తర్వాత 2009లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో వచ్చిన




"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151.